www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 27 మార్చి 2024
5
చిత్తూరు



స్పందన హాల్‌ను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా సచివాలయంలో ఆధునాతనంగా నిర్మించిన స్పందన హాల్‌లో మౌలిక వసతుల కల్పనను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. షన్మోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నూతన స్పందన హాల్‌ను పరిశీలించి మౌలిక సదుపాయాలు, ఇతరత్రా ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేసి భవనాన్ని త్వరగా వాడుకలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. స్పందన హాల్‌లో ఫర్నిచర్, పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టమ్, పెయింటింగ్ మిగిలిన ఇతర పనులు, వసతుల ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జెసి పి.శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్య, పిఆర్ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

తెచ్చిన నీళ్లు తెల్లారే ఇంకిపోయాయి

- జగన్ ఇచ్చిన జీవోలు, నొక్కిన బటన్లన్నీ డమ్మీలే
- అధికారంలోకి వచ్చిన ఏడాదిలో కుప్పంకు హంద్రీనీవా
- రాజుపేట వద్ద బ్రాంచి కెనాల్ పరిశీలించిన చంద్రబాబు



- హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - రామకుప్పం

'ట్యాంకర్‌లో నీళ్లు తెచ్చి సెట్టింగ్‌లా గేటు పెట్టి జగన్ బటన్ నొక్కి వెళ్లిపోయారని, బటన్ నొక్కినా పూర్తిస్థాయిలో నీళ్లు రాలేదని, తెచ్చి పోసిన నీళ్లు తెల్లారేసరికి ఇంకిపోయాయి' అని చంద్రబాబు ఎద్దేవా చేశారు. ఉత్తుత్తి బటన్ నొక్కి నీళ్లు వదిలారని, కనీసం మట్టి పెళ్లలు కూడా తడవలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలో కుప్పంకు హంద్రీనీవా నీళ్లు తెస్తానని ఎన్నికల హామీ ఇచ్చారు. కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా రెండో రోజు మంగళవారం రాజుపేట వద్ద హంద్రీనీవా కాల్వను టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు పరిశీలించారు. ఫిబ్రవరి 26వ తేదీన ఇదే ప్రాంతంలో సిఎం జగన్ బటన్ నొక్కి కుప్పానికి హంద్రీనీవా జలాలు విడుదల చేసిన సంగతి విదితమే. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మీడియాతో మాట్లాడుతూ ఇలాంటి సెట్టింగ్‌ల సిఎం వస్తాడని డైరెక్టర్లు, నిర్మాతలు కూడా అనుకోలేదన్నారు. కుప్పం భూమిపై నడిస్తే అరిగిపోతాడని రెండు హెలిప్యాడ్‌లు ఏర్పాటు చేసి తిరిగాడని, ఆర్టీసీ బస్సులు, స్కూలు బస్సులన్నీ పెట్టి జనాన్ని తరలించారన్నారు. ఇలాంటి ఘనకార్యాలు చేసిన నువ్వు నన్ను ఓడిస్తావా అని ప్రశ్నించారు. ప్రజలు ఛీ కొడతారన్న ఇంగితజ్ఞానం లేకుండా నీళ్లు తెచ్చానంటూ డ్రామాలాడారన్నారు. ఐదేళ్లుగా నడిపిన వైసిపి డ్రామా కంపెనీని శాశ్వతంగా మూసేయబోతున్నామన్నారు. రోడ్డు మార్గంలో పర్యటనకు మళ్లీ కుప్పంకు వస్తానని జగన్మోహన్‌రెడ్డి చెబుతున్నారని, హెలికాప్టర్లలో వస్తే చెట్లు నరికించేశాడని, రోడ్లు మీద వస్తే ఇళ్లు పీకేస్తాడేమో అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రికార్డులు తారుమారు చేస్తున్నారని, పట్టాదారు పాసుపుస్తకాలు, సర్టిఫికెట్లపై జగన్ ఫొటో పెట్టుకున్నారన్నారు. అధికారంలోకి వస్తే రెస్కోను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆనందరెడ్డి, నేతలు మునస్వామి, నరసింహులు, ఆంజనేయరెడ్డి, చిన్నకృష్ణ, చలపతి, రామ్మూర్తి, నందారెడ్డి పాల్గొన్నారు.

పూజారులపై వైసిపి దాడి అమానుషం

పూజారులపై వైసిపి దాడిని చంద్రబాబునాయుడు ఖండించారు. కుప్పం పర్యటనలో భాగంగా మీడియాతో ఆయన మాట్లాడారు. పూజారిని కాళ్లతో తన్నడం, కొట్టడం హేయమైన చర్యన్నారు. అర్చకుడంటే దేవునికి, భక్తునికి మధ్య అనుసంధానకర్తని, అలాంటి వ్యక్తిపై వైసిపి నేతలు దాడి చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో వరుసగా విగ్రహాలపై దాడులు జరిగాయని, ఒక్క కేసులోనైనా నిందితునిపైన చర్యలు తీసుకోలేదన్నారు.

నేడు పలమనేరులో ప్రజాగళం

ఈనెల 27న టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు పలమనేరులో చేపట్టనున్న ప్రజాగళం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రివర్యులు ఎన్.అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. జౌళివీధిలో ఉదయం 9.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుందని, పెద్దఎత్తున ప్రజలు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, నాయకులు రామచంద్రనాయుడు, ఖాజీపీర్ పాల్గొన్నారు.

చలమయ్య కుటుంబానికి ఆర్థిక సాయం

కుప్పం మహిళల ముఖాముఖి సమావేశాన్ని ముగించుకుని మంగళవారం తిరుగు ప్రయాణమై వెళుతుండగా టిడిపి కార్యకర్తలకు రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్రవాహాన్ని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రామకుప్పం మండలం ఆనిగానూరు గ్రామానికి చెందిన చలమయ్య (32), నాగభూషణం (38) గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం పిఇఎస్ ఆస్పత్రికి తరలించారు. చలమయ్య చికిత్స పొందుతూ మృతిచెందాడు. గాయపడిన నాగభూషణంను చంద్రబాబునాయుడు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. చలమయ్య కుటుంబానికి మూడు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందిస్తూ ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.



చిత్తూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ (ఫైల్‌ఫోటో)

నీటి సరఫరాలో 'శుద్ధి' ఏదీ..

- శుద్ధి చేయకుండానే తాగునీరు
- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- పట్టణవాసులకు పొంచి ఉన్న రోగాలు
- నిద్రావస్థలో ఇంజనీరింగ్ అధికారులు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో:

చిత్తూరు.. జిల్లా కేంద్రమైనప్పటికీ మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రజలకు ప్రతిరోజు ఆలము, క్లోరిన్ కలిపి శుద్ధి చేసిన నీటిని ప్రజలకు సరఫరా చేయాలి. అయితే గత నెల రోజులుగా చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు ఆలము, క్లోరిన్‌ను నీటిలో కలిపి శుద్ధి చేయకుండా కేవలం రంగు మారిన నీటిని మాత్రం సరఫరా చేస్తుండడంతో పట్టణవాసులు రోగాలకు గురవుతున్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఎన్నికల బిజీలో ఉండిపోవడంతో ప్రజల ఆరోగ్యం గురించి పట్టించుకోకుండా ఆలము, క్లోరిన్ కలిపి శుద్ధి చేయకుండా నీరు సరఫరా చేయడం వల్ల చిన్నారులు, మహిళలు, వృద్ధులు వివిధ రకాల జబ్బులతో ఆసుపత్రి పాలవుతున్నారు. చిత్తూరు ఎన్టీఆర్ జలాశయం నుంచి ఓవర్ హెడ్ ట్యాంక్ ద్వారా చిత్తూరు వాసులకు నగరపాలక సంస్థ నీటిని సరఫరా చేసేవారు. గత నెల రోజులకు పైగా రంగు మారిన నీరు సరఫరా చేయడం వల్ల చిత్తూరు ప్రజలు అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారో తెలీడం లేదని నగరవాసులు ఆరోపిస్తున్నారు.

చిత్తూరు పట్టణంలో రెండు లక్షల పైగా జనాభా ఉన్నారు. చిత్తూరు జిల్లా కేంద్రం కావడంతో వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తే అధికారులు, ఉద్యోగులు ఇక్కడ నివాసం ఉంటున్నారు. నగరవాసులకు రోజుకు ఐదు నుంచి ఏడు ఎంఎల్‌డి తాగునీరు సరఫరా చేస్తున్నట్టు తెలుస్తుంది. ఇక్కడ సుమారు 200 బోర్లు ఉన్నాయి. 50 డివిజన్లో రెండు, మూడు రోజులకు ఒకసారి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈనీరు సరిపడకపోవడంతో చాలామంది ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయిస్తూ ఉంటారు. అసలే ఎండాకాలంతో ప్రజలు వేడితో అల్లాడిపోతుంటే నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు ఇలా నీటిని శుద్ధి చేయకుండా పంపిణీ చేయడం వల్ల గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిన ఘటన మనకు గుర్తుకువస్తుంది. నెలరోజుల క్రితం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆలము, క్లోరిన్ శుద్ధి చేయకుండా నీటి సరఫరా చేయడం వల్ల 50 మంది పైగా ప్రజలు అస్వస్థకు గురై ఆస్పత్రి పాలైన విషయం తెలిసిందే.

చిత్తూరు వాసులకు మున్సిపల్ కార్పొరేషన్ అందించే తాగునీరు ఆలము, క్లోరిన్ కలిపి శుద్ధి చేసి సరఫరా చేయాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టెండర్ పిలిచి ఆలం, క్లోరిన్ తీసుకొని నీటి శుద్ధి చేయడానికి ఉపయోగించాల్సి ఉంటుంది. కానీ కమిషనర్ టెండర్లు పిలవకుండా ఎన్నికల షెడ్యూల్ బిజీలో ఉండడం వల్ల ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. ప్రజలు ఆసుపత్రిల పాలవ్వకుండా చూసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉంది. కొంతమంది స్థానిక చిన్నచిన్న కాంట్రాక్టర్ల చేత ఆలం క్లోరిన్ తీసుకొని అప్పుడప్పుడు శుద్ధి చేస్తున్నట్టు తెలుస్తుంది. ఈ పద్ధతిని మానుకొని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రజలు రోగాలకు గురి కాకుండా ఉండేందుకు శుద్ధిచేసిన నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

క్లోరినేషన్ చేసి నీటిని సరఫరా చేస్తున్నాం

- డాక్టర్ అరుణ, మున్సిపల్ కమిషనర్



చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆలం, క్లోరిన్ కలిపి శుద్ధి చేసిన నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నాం. నీటిని శుద్ధి చేయకుండా సరఫరా చేయడం లేదు, ఒకటి, రెండు రోజులు అలా జరిగి ఉండవచ్చు కానీ, నిత్యం తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు వహిస్తున్నాం.

మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించండి

కమిషనర్‌కి సిఐటియు వినతి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగర మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నూతన కమిటీ ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు, ప్రధానకార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడుతూ పర్మినెంట్ ఉద్యోగులను ఇప్పటివరకు రెగ్యులరైజ్ చేయలేదని వెంటనే చేయాలని ప్రభుత్వానికి సిఫార్సులు పంపాలని కోరారు. అలాగే పిఎఫ్ ఖాతాలను జిపిఎఫ్ ఖాతాలగా మార్చాలని, 6, 12, 18, 24 సంవత్సరాలకు స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్స్ ఇవ్వాలని, ఔట్సోర్సింగ్ కార్మికులకు పిఎఫ్ ప్రస్తుత ఆధార్ కార్డు అనుగుణంగా ఆప్కాస్ పీఎఫ్ ఖాతాలు మార్చాలని, 60 సంవత్సరాల రిటైర్డ్ అయిన ఔట్సోర్సింగ్ కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే మొన్న జరిగిన సమ్మెలో ఒప్పందం ప్రకారం సంక్రాంతి కానుక రూ.1000లు రాష్ట్రమంతా ఇచ్చిన చిత్తూరు కార్పొరేషన్‌లో ఇప్పటివరకు ఇవ్వలేదని వెంటనే ఇవ్వాలని అన్నారు. అవుట్సోర్సింగ్ కార్మికులను డ్రైవర్లుగా పని చేయించుకుంటూ కార్మికులకు ఇచ్చే జీతాలు ఇవ్వడం సరైంది కాదని జీవో ప్రకారం డ్రైవర్ల వేతనం ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా పారిశుధ్య కార్మికులకు చీపుర్లు, గంపలు, యూనిఫాం, కొబ్బరినూనె, చెప్పులు వంటివి వెంటనే ఇవ్వాలని కోరారు. ఈ సమస్యల పై కమీషనర్ స్పందిస్తూ తన పరిధిలోని సమస్యలను పరిష్కారం చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. యూనియన్ నాయకులు నాగరాజు, సుబ్రహ్మణ్యం, ఎస్.బాబు, దొరసామి, లోకనాథం, వరలక్ష్మి, రాణి, ఈశ్వరరావు, భూపతి తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

పోటాపోటీగా ఎన్నికల ప్రచారం

- దూసుకుపోతున్న వైసిపి
- ఉనికి చాటుకుంటున్న టిడిపి
- కనిపించని బిసివై పార్టీ

ప్రజాశక్తి- సోమల

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన రోజు నుండి రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాలు మిన్నంటాయి. ఒకరిపై ఒకరు పోటీ పడుతూ ప్రచారం చేస్తూ తమ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తూ ప్రచారాన్ని చేస్తున్నారు. గతంలో ఎన్నికల సంఘం నియమావళిని ప్రతి ఎన్నికల సమరంలోనూ అప్పటి పరిస్థితులను బట్టి కఠినతరం చేస్తూ రావడం ప్రచారం చేసే విధానంలోనూ నూతన సవరణలు చేస్తూ ప్రకటిస్తూ ఉండడంతో గతంలో లౌడ్ స్పీకర్ల హోరు, పార్టీ జెండాల జోరు, గోడలపై రాతలు ఆయా పార్టీల కార్యకర్తలు మండల స్థాయి నాయకులు నియోజకవర్గ స్థాయి నాయకులు ప్రచారం కోసం హడావిడి చేస్తూ తిరుగుతూ ఎన్నికలు దగ్గర పడే కొద్ది మరింత ఉత్సాహంగా ప్రచారం చేసేవారు. అయితే రానురాను ఎన్నికల నియమావళి ప్రకారం నడుచుకోవాల్సి రావడం కఠిన నియమాలు అమలుకావడంతో చాలావరకు పైవన్నీ కనుమరుగయ్యాయి. తక్కువ సమయంలోనే ప్రచారం చేయాల్సి రావడం తక్కువ వ్యయం ఖర్చు చేయాల్సిన కారణంగా నాయకులు క్షేత్రస్థాయిలోని కార్యకర్తలపై పూర్తిగా ఆధారపడి ప్రచార కార్యక్రమాలను వారికి అప్పగించి అప్పుడప్పుడు అభ్యర్థి రావడం ప్రచారంలో పాల్గొనడం నేడు జరుగుతోంది.





కాగా మండలంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో రోజు పల్లెల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. మరొక్కసారి జగన్‌కు అవకాశం ఇవ్వాలని, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ముమ్మరంగా ప్రచారం చేస్తూ వస్తున్నారు. ఈనేపథ్యంలోనే బైక్ ర్యాలీలు, ఆలయాల్లో పూజలు, గ్రామాల్లో రాత్రి వేళల్లో ప్రచారంలో దూసుకుపోతున్నారు.

ఇక తెలుగుదేశం పార్టీ అభ్యర్థి చల్లా బాబు ఈనెల 17వ తేదీ ఆదివారం సోమల పంచాయతీలో ప్రచారం నిర్వహించారు. ఆ తర్వాత మండలంలోని టిడిపి శ్రేణులు ఎక్కడా ప్రచారాలు నిర్వహిస్తున్న ఆనవాళ్లు కానీ హంగామాకానీ కనిపించలేదు. టిడిపి కేవలం ఉనికిని చాటుకునేందుకు ఒక్కరోజు పర్యటనలో భాగంగా ప్రచారం జరిగిందే తప్ప ఆ తర్వాత ఆ పార్టీకి సంబంధించి ఎలాంటి ప్రచార కార్యక్రమాలు చేపట్టలేదని అనిపిస్తుంది.

భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ కూడా మండలంలో ఎక్కడా ఇంతవరకు ప్రచారం నిర్వహించలేదు. తన అభిమానులు, కార్యకర్తలు మండలంలో ఎక్కడా కరపత్రాలు చేత పట్టి ప్రచారం చేసిన దాఖలాలు లేవు. పోలింగ్ తేదీ దగ్గర పడే కొద్ది ఏఏ పార్టీలు ఎంత మేర ప్రచారాన్ని చేసి తమ నాయకులను గెలిపించుకుంటారన్నది వేచి చూడాల్సిందే.

పెయిడ్ న్యూస్ పై నిశిత పరిశీలన

జిల్లా ఎన్నికల అధికారి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

సార్వత్రిక ఎన్నికలు- 2024కు సంబంధించి ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో వివిధ ప్రసార మాధ్యమాలలో ప్రసారమయ్యే పెయిడ్ న్యూస్ పై నిశిత పరిశీలన చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని స్పందన హాల్ నందు ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి)లో భాగంగా విధులు నిర్వర్తిస్తున్న అధికారులు సిబ్బందితో సమావేశమయ్యారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ పెయిడ్ న్యూస్‌కు సంబంధించి వివిధ ప్రసార మాధ్యమాలలో వస్తున్న వార్తలను పరిశీలించి నమోదు చేయాలని తెలిపారు. రాజకీయ పార్టీలు అభ్యర్థులపై వస్తున్న అడ్వర్టైజ్మెంట్‌లను ఎప్పటికప్పుడు రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా, ప్రైవేట్ ఎంఎఫ్‌లలో ప్రసారాల కొరకు ఎన్నికల కోడ్ అమలు రోజు నుండి, ప్రింట్ మీడియాలో ప్రకటనల కొరకు పోలింగ్ ముందు రోజులు, పోలింగ్ రోజున ప్రకటనల కొరకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసార అనుమతుల కొరకు వచ్చే పొలిటికల్ అడ్వర్టైజ్మెంట్‌లను ఎన్నికల నిబంధనల మేరకు ఉన్నవి లేనివి పరిశీలించి ప్రీ సర్టిఫికేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రీ సర్టిఫికేషన్ కొరకు వచ్చే దరఖాస్తులను వరుస క్రమం ప్రకారం అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని ఎంసిఎంసి అనుమతులు లేకుండా ప్రసారం చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్య, ఎంసిఎంసి నోడల్ అధికారి బి.నాగేశ్వర రావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలపై నివేదికలు ఇవ్వాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికలు -2024 దృష్ట్యా బ్యాంకులలో రూ.10లక్షలకు పైబడి జరిగే ప్రతి లావాదేవీ వివరాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులుతో కలిసి బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న విడుదల కానున్నదని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు వారి పేరు పై లేదా వారి ఏజెంట్‌ల పేరు పై ఖాతాలను ప్రారంభించే విషయంలో బ్యాంక్ వారు సహకరించాలని, అభ్యర్థులకు సంబంధించి నగదు బదిలీ సమయంలో సంబంధిత ఎన్నికల అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం విడుదల చేయడం జరిగిందని, బ్యాంకులలో రూ.10 లక్షల పైగా లావాదేవీలు చేసే ఖాతాల మీద దృష్టి పెట్టె క్రమంలో అలా లావాదేవీలు నిర్వహించే ఖాతాల వివరాలను కమిటీకి అందజేయాలన్నారు. జిల్లాలో 24 బ్యాంకుల పరిధిలో 264 బ్రాంచులున్నాయని, ఆర్థిక లావాదేవీల విషయంలో సమాచారం అందించాల్సిన బాధ్యత బ్యాంకులపై ఉందని అన్నారు. జిల్లాలోని బ్యాంకులు తమ నగదు బదిలీలను ఇతర బ్రాంచ్‌లకు చేసే సమయంలో ఇటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందుగానే వారు సంబంధిత రిటర్నింగ్ అధికారి, పోలీస్ అధికారులకు సమాచారం అందించి ఎటువంటి జాప్యం లేదా ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. బ్యాంకర్లు నగదు బదిలీకి వాహనాలు మార్చకుండా ఉంటే వాహనాల నెంబర్లు ఇవ్వాలని, వాహనాలను మార్చి పంపినట్లయితే ఆ వివరాలను రిటర్నింగ్ అధికారి, పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని, క్యూ.ఆర్ కోడ్ ద్వారా అనుమతి పొందాలన్నారు. బ్యాంకర్లతో సమన్వయం చేసుకునేందుకు చుడా వైస్ ఛైర్మన్ విశ్వనాథ్‌ను నియమించారు. అదేవిధంగా ఎక్స్‌పెండిచర్ నిర్వహణ నోడల్ అధికారి కృష్ణారెడ్డిలకు లావాదేవీల సమాచారం పంపాలన్నారు. ఈ సమావేశానికి లీడ్ బ్యాంకు మేనేజర్ హరీష్, జిల్లాలోని ఇతర బ్యాంకుల ప్రతినిధులు హాజరయ్యారు.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

మూడు లారీలు బోల్తా

వ్యక్తి పరిస్థితి విషమం, మరొకరికి గాయాలు

ప్రజాశక్తి- తవణంపల్లి, బంగారుపాళ్యం



బంగారుపాళ్యం మండలంలో మూడు భారీ కంటైనర్ లారీలు బోల్తాపడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కంటైర్ కింద చిక్కుకున్న వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సిఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మొగలి ఘట్ వద్ద బెంగళూరు నుంచి చిత్తూరుకి వెళుత్తున్న లారీ అతివేగంతో ఘాట్ దిగుతుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. కాగా ఈ ప్రమాదాన్ని గమనించని మరో రెండు లారీలు వేగంగా రావడంతో ఒకదానికొకటి ఢీకొని బోల్తాపడ్డాయి. ఒక లారీలో చింతపండు పొట్టు, మరో లారీలో సున్నం లోడ్డుతో వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో రోడ్డు మొత్తం సున్నంతో నిండిపోయింది. దీంతో కొంత సమయం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి క్షతగాత్రులను చిత్తూరుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కొరకు వేలూరు సీఎంసికి తరలించారు. సిఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉల్లంఘనలపై ఉక్కుపాదం

- నియమావళిని అతిక్రమిస్తే చర్యలు కఠినతరం
- కోడ్ నిబంధనలకు లోబడే వ్యవహరించాలి
- నగర పరిధిలో సీ-విజిల్ ద్వారా 19 ఫిర్యాదులు
- ఏఆర్‌వో, కమిషనర్ డాక్టర్ జె.అరుణ


సి-విజిల్ యాప్ ఫిర్యాదులపై విచారిస్తున్న నగర కమిషనర్


ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలయ్యేలా అధికారులు వ్యవహరించాలని ఏఆర్‌వో, కమిషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుపై ఎంసీసీ ఎఫ్ఎస్టీ, వీఎస్టీ, లా అండ్ ఆర్డర్, స్వీప్ బృందాలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు తీరుపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసే బ్యానర్లు, జెండాలు, పోస్టర్లను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏ కార్యక్రమం అయినా రిటర్నింగ్ అధికారి వద్ద నుండి అనుమతులు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల కార్యక్రమాలకు సంబంధించి అనుమతులను తనిఖీ చేయాలన్నారు. అన్ని ఎన్నికల బృందాలు రోజువారి నివేదికలను సకాలంలో, సక్రమంగా సమర్పించాలన్నారు. స్వీప్ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని, 18సంవత్సరాలు పూర్తయిన వారు ఓటరుగా నమోదు, ఓటు హక్కు సద్వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏసీపీ రామకృష్ణుడు, సీఎంఎం గోపి, ఆర్వో గోపాలకృష్ణ వర్మ, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, స్వీప్ నోడల్ అధికారి చిన్నయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'సి-విజిల్'లో ఫిర్యాదుపై విచారణ

ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి "సి విజిల్" ద్వారా అందిన ఫిర్యాదుపై ఏఆర్వో, కమిషనర్ డాక్టర్ జె.అరుణ క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. మంగళవారం ఎస్‌బీఐ కాలనీ మొదటి వీధిలో టీడీపీ నాయకులు డి.ప్రసాద్ రావు కార్యాలయం వద్ద అనుమతులు లేకుండా హోర్డింగ్‌లు పెట్టారని సి-విజల్ యాప్ ద్వారా ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదుపై ఎంసీసీ, ఎఫ్ఎస్టీ అధికారులతో కలిసి ఏఆర్వో అరుణ తనిఖీలు చేశారు. కార్యాలయం వద్ద హోర్డింగ్స్, వాహనాలు, సౌండ్ సిస్టమ్‌కు సంబంధించి తీసుకున్న అనుమతులను పరిశీలించారు. అన్నింటికీ సరైన అనుమతులు తీసుకున్నట్లు గుర్తించి, రిటర్నింగ్ అధికారికి నివేదిక అందించారు. సి-విజిల్ యాప్ ద్వారా నగరపాలక పరిధిలో ఇప్పటివరకు 19 ఫిర్యాదులు అందాయని ఆమె తెలిపారు. అందిన ఫిర్యాదులను ఎంసీసీ, ఎఫ్ఎస్టీ బృందాలు 30 నిమిషాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకొని, రిటర్నింగ్ అధికారికి నివేదికలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంసీసీ, ఎఫ్ఎస్టీ అధికారులు రామకృష్ణుడు, గోపి, గోపాలకృష్ణ వర్మ, పోలీసులు పాల్గొన్నారు.

ఈ కొలువులు మాకొద్దు సార్..

- 12మంది వలంటీర్లు, నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్‌ల రాజీనామా


రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు

ప్రజాశక్తి-వికోట: మండలంలోని కుంబార్లపల్లి సచివాలయానికి చెందిన 12మంది వలంటీర్లు తమ కొలువులకు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీవో గోవర్ధన్‌కు రాజీనామా పత్రాలను అందజేశారు. స్పందించిన ఎంపీడీవో ఆ పత్రాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా

మండలంలో ఉపాది హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న నలుగురు మంగళవారం తమ విధులకు రాజీనామా చేశారు. గోనుమాకులపల్లికి చెందిన దివాకర్, బైరుపల్లికి చెందిన కీర్తిన, మణికుమార్, కృష్ణాపురం చెందిన వెంకటేష్‌లు తమ ఉద్యోగాలుకు రాజీనామ చేస్తూ లేఖలను చిత్తూరు జిల్లా డ్వామా పీడీ రాజశేఖర్‌కు సమర్పించారు. డ్వామా పీడీ వారి రాజీనామా లేఖలను ఆమోధించి వారిని విధుల నుండి తొలిగిస్తూ, తదుపరి చర్యలు తీసుకోవడానికి స్థానిక ఎంపిడివో గోవర్ధన్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్క రోజే నలుగురు ఉపాది హామీ సిబ్బంది, 12 మంది వాలంటీర్లు ఉద్యోగాలకు రాజీనామా చేయడం మండలంలో చర్చనియాంశంగా మారింది.


రాజీనామా పత్రాలను అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లు

ప్రతి కూలీకి ఉపాధి పనులు


సమీక్షలో మాట్లాడుతున్న ఏపీడీ శ్రీనివాసులు

- వంద రోజుల పనిదినాలకు సద్వినియోగం చేసుకోవాలి
- క్షేత్ర స్థాయి సిబ్బంది ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనేందుకు వీల్లేదు
- ఏపీడీ శ్రీనివాసులు

ప్రజాశక్తి-సోమల: కోరిన ప్రతి కూలీకి వంద రోజులు పని కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఏపీడీ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏడాధి బడ్జెట్‌కు సంబంధించి లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఉపాధి హామీ పనులపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించి కూలీల సంఖ్య పెంచేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ ప్రచారాల్లో పాల్గొనే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రవర్తించాలన్నారు. కోడ్ ఉల్లంఘనలకు ఎట్టిపరిస్థితిలో తావులేకుండా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో దినకర్, రిజ్వాన్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక


టీడీపీలో చేరుతున్న యువకులు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని వేపంజేరి పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ నుండి టీడీపీలో చేరారు. మంగళవారం టీడీపీ జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కండువా కప్పిన థామస్ పార్టీలోకి ఆహ్వానించారు. డాక్టర్ థామస్, జనసేన ఇన్‌ఛార్జ్ పొన్నా యుగంధర్‌లు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే అది ఒక టీడీపీతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు క్రిష్ణారెడ్డి, కృష్ణమనాయుడు, రిటైర్డ్ ఎస్పీ చిన్నస్వామి, పద్మనాభరెడ్డి, రాజేంద్ర శెట్టి, కృష్ణమూర్తిరెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, స్వామిదాస్, శ్రీధర్‌యాదవ్, ఇందిరమ్మ, దేవ సుందరం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పిస్తాం: కృపాలక్ష్మీ


వైసీపీలో చేరుతున్న యువకులు

ప్రజాశక్తి-కార్వేటినగరం: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని వైసీపీ జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మీ అన్నారు. మంగళవారం మండలంలోని టీకేఎం పేటలో పర్యటించారు. ఈ సందర్భంగా 30మంది యువకులు డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కృపాలక్ష్మీ సమక్షంలో వైసీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కృపాలక్ష్మీని ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఎంపీపీ లతబాలాజీ, నాయకులు ధనంజయవర్మ, ధన్రాజ్, ఆకుల గోపి, కుప్పారెడ్డి, రంగయ్య ఆధ్వర్యంలో రఘు, శంకరయ్య, రాము, రవీంద్రబాబు, దూరవాసులు, మురగేశం, విజయ్, మునిరత్నం, భరత్, రూపేష్, శివప్రసాద్, ప్రదీప్, ప్రశాంత్, లోకేష్, నరేష్, కార్తీక్ పలువురు పార్టీలో చేరారు.

మూడు తలలున్న వింత దూడ జననం


మూడు తలల వింత దూడ

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: జీడీ నెల్లూరు మండలం బుక్కాపట్నంలోని జిలేబి అనే రైతు ఇంట ఉన్న పశువు మంగళవారం వింత దూడకు జన్మనిచ్చింది. జిలేబీ ఆనే రైతు ఇంట రెండు పశువులు ఉండగా.. అందులోని ఓ పశువు మూడు తలలు, మూడు నోళ్లు, మూడు నాలుకలతో కలిగిన పళ్ళు ఉన్న ఒక వింత దూడకు జన్మనిచ్చింది. దీన్ని గుర్తించిన ఆ రైతు ఇంట్లోని కుటుంబ సభ్యులు మొదట భయభ్రాంతులకు గురయ్యారు. ఈ వింతను చూడటానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు.

ఓటు.. అందరి బాధ్యత



ప్రజాశక్తి-శాంతిపురం: ఓటు అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకొని సమాజాభివృద్ధికి దోహద పడాలని వెలుగు సంఘాల ఏపీఎం గ్రీటా అన్నారు. మంగళవారం ఓటు విలువను తెలయజేస్తూ స్వీప్ కార్యక్రమం ద్వారా చైతన్య ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, మోహన్, సీసీలు పాల్గొన్నారు.

వైసీపీకి తగిన గుణపాఠం చెబుతాం: చల్లా


ఎన్నికల ప్రచారంలో చల్లా రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-పుంగనూరు: టీడీపీ అధికారంలోకి రాగానే వైసీపీకి తగిన గుణపాఠం చెబుతామని టీడీపీ పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చింది మొదలు రాష్ట్రం అన్ని రకాలుగా నష్టపోయిందని, వెనుగబడిన అభివృద్ధిని అధికారంలోకి రాగానే పరుగులు పెట్టిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. పట్టణంలోని పలు వీధుల్లో ఇంటింటికీ వెళ్లి టీడీపీకి ఓటేసి ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సయ్యద్ సుహేల్ బాషా, సివిరెడ్డి, మజా కౌన్సిలర్ ప్రకాష్, శ్రీనివాస్ , రామయ్య, నాగరాజు, సుబ్రమణ్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వ్యాపారవేత్త..

పుంగనూరు పట్టణానికి చెందిన దోమలపాటి నగేష్‌బాబు(ఆర్‌వీటీ బాబు) మంగళవారం టీడీపీలో చేరారు. కుప్పం పర్యటనలో ఉన్న చంద్రబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనకు చంద్రబాబు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన ఆర్‌వీటీ బాబు

చప్పిడిపల్లికి తాగునీటి కష్టాలు


ట్యాంకర్ వద్ద నీళ్లు తీసుకెళుతున్న మహిళలు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని చప్పిడిపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో తాగునీటి కష్టాలు తప్పడం లేదు. తాగునీరు అందక ట్యాంకర్లతో చాలీచాలని నీళ్లను అందిస్తున్నారని అక్కడి మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి బోరు ఏర్పాటు చేసి నీటి కష్టాలను తీర్చాలని కోరాతున్నారు.

ఇంటింటి ప్రచారం



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: టీడీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ ఇంటింటి ప్రచారంలో దూసుకుపోతున్నారు. మంగళవారం చిత్తూరు కార్పొరేషన్ పరిధిలోని 5, 6,7 డివిజన్లో టీడీపీ, జనసేన, బిజెపి నాయకులతో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, నాయకులు దొరబాబు, కటారి హేమలత, వసంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-సదుం: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మారుతి అన్నారు. మంగళవారం మండలంలోని కలకటవారిపల్లిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. సైబర్ నేరాల బారిన పడితే 48గంటల లోగా 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో స్వచ్ఛందంగా ఓటును వినియోగించుకోవాలని సూచించారు. ప్రలోభాలకు గురుకాకుండా ఉండాలన్నారు.

జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి-సదుం: మండలంలోని పాలమంద సమీపంలో జూదం ఆడుతున్న వారిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మారుతి తెలిపారు. మంగళవారం ఆయన మట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు దాడులు చేపట్టామన్నారు. పాలమంద సమీపంలోని సవటగుంట దగ్గర బహిరంగ ప్రదేశంలో రవీందర్ రెడ్డి, అతనితో కలిపి ఐదు మంది అందర్ బహర్ అనే పేకాట ఆడుతున్నట్లు గుర్తించామన్నారు. వారిని అదుపులోకి తీసుకొని రూ.5270నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఆ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ట్రాక్టర్‌పై నుంచి జారిపడి వ్యక్తి మృతి



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ట్రాక్టర్‌పై నుండి ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. జీడీనెల్లూరు మండలంలోని వింజం లక్ష్మారెడ్డిపల్లె దళిత వాడకు చెందిన మహేంద్రన్(42) అతని కుమార్తె మమత పదవ తరగతి పరీక్ష రాసి జీడీ నెల్లూరు నుండి ఇంటికి తిరుగు ప్రయాణం కోసం ఎదురు చూస్తుండగా ఎస్.ఎస్ కొండ వైపు వెళుతున్న ట్రాక్టర్‌లో మహేంద్రన్ తో పాటు అతని కుమార్తె, మరి కొంతమంది విద్యార్థులతో కలిసి ట్రాక్టర్‌లో ఎక్కారు. మార్గమధ్యంలో ద్వారకా నగరం వద్ద వెళుతుండగా డ్రైవర్ భాస్కర్ పక్కన కూర్చున్న మహేంద్రన్ ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుండి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులకు అక్కడకు చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. ట్రాక్టర్ నడుపుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి పూర్తి దర్యాప్తు చేస్తామని సీఐ శంకర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వలంటీర్లను తీవ్రవాదులతో పోల్చడం తగునా..

- బొజ్జల సుధీర్‌రెడ్డిపై డాక్టర్ సునీల్ ఫైర్

ప్రజాశక్తి-తవణంపల్లి: ప్రజా సంక్షేమ పథకాలను ఇంటింటి చేరవేస్తున్న వలంటీర్లను టీడీపీ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ తీవ్రవాదులతో పోల్చడం తగదని వైసీపీ పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ ఫైర్ అయ్యారు. మంగళవారం మండలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరోనా కష్ట కాలంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా వలంటీర్లు ప్రజలకు సేవలందించారని, అటువంటి వారిపై సుధీర్‌రెడ్డి తీవ్ర వాఖ్యలు చేయడం సబబుకాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు హరికృష్ణ, శరత్ చంద్రారెడ్డి, పరమేశ్వర్ రెడ్డి ఉన్నారు.

బంగారుపాళ్యం: వైసీపీ విజయానికి అందరూ సహకారం అందించాలని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని గుండ్లకట్టమంచిలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైసీపీకి ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, నాయకులు చంద్రారెడ్డి, దొరస్వామి, అశోక్‌కుమార్‌రెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై 'వడ్డీ మాఫీ'కి

ఇక ఐదు రోజులే...

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : 2023 -24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులపై వడ్డీ మాఫీ గడువు ఇక ఐదు రోజులే మిగిలి ఉందని, ఈ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ డాక్టర్ జె.అరుణ కోరారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను బకాయిల మొత్తాన్ని ఒకేసారి చెల్లించిన వారికి వడ్డీ మాఫీ ఉంటుందన్నారు. బకాయిల మొత్తాన్ని ఈనెల 31 తేదీలోగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. వడ్డీ మాఫీ అవకాశాన్ని పొందడానికి ఇక కేవలం ఐదు రోజులు మాత్రమే మిగిలి ఉందని పన్ను చెల్లింపుదారులు వారి పన్ను బకాయిలను ఏక మొత్తంగా చెల్లించి వడ్డీమాఫీ పొందాలన్నారు. సెలవు రోజుల్లోనూ నగరపాలక కార్యాలయంలోని పురసేవ కేంద్రం పనిచేస్తుందని, వార్డు సచివాలయాల్లోనూ పన్నులను చెల్లించవచ్చని కమిషనర్ తెలిపారు.

శివయ్య సేవలో సుప్రీం జడ్జి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సుప్రీంకోర్టు న్యాయమూర్తి హృషికేసి రాయ్ మంగళవారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ అధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. రాహు-కేతు సర్ప దోష నివారణ పూజలు చేసుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తదనంతరం గురుదక్షిణా మూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి జ్ఞాపికలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

పోనకా దేవసేనమ్మను కలిసిన మండ్ల రాజేష్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణానికి చెందిన మండ్ల రాజేష్ కుమార్, వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. దీంతో పట్టణంలోని కరణాలవీధిలో నివాసముంటున్న పీ.ఎస్సార్ నివాసానికి చేరుకుని స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి తనకు పదవి లభించిందని రాజేష్ తెలిపారు. దీంతో దేవసేనమ్మకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ దేవసేనమ్మ మాట్లాడుతూ పార్టీలో అందరినీ కలుపుకుపోతూ మరెన్నో పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బాలిబోయిన రమేష్, నాయకులు చిన్నా, రాఘవరెడ్డి, హరి, రఘు, అజయ్ పాల్గొన్నారు.

వలంటీర్ల నిరసన

ప్రజాశక్తి -ఏర్పేడు: ంబొజ్జల వెంకట సుధీర్ రెడ్డి వాలంటీర్ వ్యవస్థ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల వాలంటీర్లు నిరసన తెలిపారు. బొజ్జల సుధీర్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన ఏర్పేడు లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వాలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం


హాస్టలు సిబ్బందిని సన్మానిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ విద్యార్థులు, వసతి గృహ అధికారి రామయ్య, హాస్టల్ సిబ్బంది హైమావతి పదవ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహ అధికారి రామయ్య మాట్లాడుతూ పదో తరగతి మొదలైనప్పటి నుండి కష్టపడి చదివారని, పై తరగతిలో కూడా కష్టపడి చదివి మంచి ఉన్నతమైన స్థాయికి చేరుకొని ఉద్యోగం సాధించాలని కోరారు. విద్యార్థులు మాట్లాడుతూ తాము చేసిన తప్పులను క్షమించి మీ ఆశీర్వాదాలతో పదో తరగతి పరీక్షలు దిగ్విజయంగా పూర్తి చేసుకున్నందుకు తమకు చాలా సంతోషంగా ఉందన్నారు. తమ విజయాలకు కారణం వార్డెన్, తమ తల్లి లాంటి వంట మనిషి హైమావతి అని కొనియాడారు. అనంతరం వంట మాస్టర్ హైమావతిని శాలువతో సన్మానించారు. ఇంట్లో తల్లిలా హాస్టల్లో తారు తమపై చూపిన ప్రేమానురాగాలకు ధన్యవాదాలు తెలిపారు. వార్డెన్ మాట్లాడుతూ ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు హాస్టల్లో విద్యార్థులు తమ సొంత బిడ్డల్లా చూసుకోవడం పట్ల, తనను కూడా విద్యార్థులు తల్లిదండ్రుల్లా భావించడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. విద్యార్థులకు వారి జీవితంలో ఎలాంటి సాయం అవసరమైనా తమకు తెలిపితే సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం అన్ని భాషలలో ఉపయోగకరం

- ఐఐటి ఆచార్యులు వెంకటరమణ

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం అన్ని భాషల్లో ఎంతో ఉపయోగకరంగా అత్యవసరంగా మారిందని ఐఐటీ ప్రొఫెసర్ ఆచార్య వెంకటరమణ పేర్కొన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్ విభాగ ఆధ్వర్యంలో "ట్రెండ్స్ అండ్ టెక్నాలజీస్ రిలేటెడ్ టు సాన్స్క్రిట్ అండ్ కంప్యూటర్ సైన్స్' అనే అంశంపై రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ సదస్సు వర్సిటీలోని రమారంజన్ ముఖర్జీ ఆడిటోరియంలో మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తిరుపతి ఐఐటి ప్రొఫెసర్, విభాగ అధ్యక్షులు డా.బి.వెంకటరమణ మాట్లాడుతూ ప్రస్తుతకాలంలో టెక్నాలజీ ద్వారా భారతీయ జ్ఞాన పరంపర, సంస్కృతం, కంప్యూటర్ సైన్స్‌కు సంబంధించిన ట్రెండ్స్ టెక్నాలజీస్ అనే అంశాన్ని వివరించారు. డిజిటల్ సంస్కృత లైబ్రరీలు, ఆర్కైవ్స్, సంస్కృతం, కృత్రిమ మేధస్సు, విద్యా ఆవిష్కరణలు, పరిశ్రమ దృక్పథాలు మొ. వాటిని గురించి తెలిపారు. విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొ జియస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడు తూ సాంకేతిక పురోగతికి, దృఢమైన భాషా నిర్మాణానికి, కంప్యూటర్ సైన్స్ చాలా అవసరమని తద్వార ఆధునిక తరానికి ఆధునిక పద్ధతుల ద్వారా సంస్కృత జ్ఞానాన్ని అందిస్తాయని వివరిం చారు. ఈ కాన్ఫరెన్స్ ద్వారా సంస్కృతం , కంప్యూ టర్ సైన్స్ మధ్య పరిశోధన చేయడానికి ఉన్న అవకాశాలను తెలిపారు. ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్, కంప్యూటర్ విభాగం ఆచార్యులు ప్రొఫెసర్ ఆర్‌జె రమాశ్రీ మాట్లాడుతూ సంస్కృత క్షేత్రంలో సాంకేతి కను విరివిగా వినియోగిస్తే మరిన్ని అద్భుతమైన పనులు పనులు చేయవచ్చని వివరించారు. ఈ సదస్సుకు కన్వీనర్‌గా ప్రొఫెసర్ బి చంద్రశేఖరం వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కన్వీనర్ ప్రొ.జి.శ్రీధర్, విభాగం అధ్యాపకులు డా.ఎమ్. మేరీ సుజాత, డా.జి.నాగలక్ష్మి, డా.జి. ప్రసన్న, ఇతర విభాగాల అధ్యాపకులు, పరిశోధకు లు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తిరుపతి ఐఐటి ప్రొఫెసర్ వెంకటరమణ